TIMES OF VARTHA (04-11-2024)MADK_times of varha main (13-2).qxd 11/4/2024 9:21 AM Page 1


# టైమ్స్ ఆఫ్ వార్త

ఎడిటర్ : గూడూరు జనార్ధన్ రెడ్డి

తెలుగు దినపత్రిక

తెలంగాణ సోమవారం, 04 - నవంబర్ - 2024 సంపుటి : 16 సంచిక : 90 పేజీలు 08 వెల : 6/-


# బిసి కులగణనకు ప్రత్యేక కమిషన్

- నేడే ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ
- కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం.. ఛైర్మన్, ముగ్గురు సభ్యులు!
- చిత్తశుద్ధితో ఉన్నామన్న రేవంత్.. 6 నుంచి రాష్ట్రంలో కులగణన



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

హైకోర్టు ఆదేశానుసారం బిసి కులగణనకు డెడికేషన్ కమిషన్ ఏ ర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రేపటి లోగా అంటే సో మవారమే ఈ కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం సిఎం తన నివాసంలో ఈ నె ల 5న రాహుల్‌గాంధీ పర్యటన, కులగణనపై హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించారు. రాహుల్ గాంధీ పర్యటనకు ముందే హైకోర్టు ఆ దేశాల మేరకు కులగణనకు డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. బీసీ కులగణనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కులగణనపై తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజా లు లేవని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైకో ర్టు ఆదేశాల మేరకు డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్టు సీఎం పేర్కొన్నారు. స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లకు న్యాయపరమైన చిక్కులు లేకుండా తగిన జాగ్రత్త లు తీసుకోవాలని సమాచారం. మరోవైపు రాష్ట్రం లో ఈనెల 6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, వి ద్య, ఉపాధి మరియు కుల సర్వేను ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఉం డేందుకు, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని అభిప్రాయపడ్డారు. కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వులను రేపటిలోగా జారీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆ దేశించారు. కుల గణన, స్థానిక సంస్థల రిజర్వేష న్ల విషయంలో ఇటీవల హైకోర్టు లేవనెత్తిన అం శాలను ప్రభుత్వం పున:సమీక్షించింది. అందరి ఏకాభిప్రాయం మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పా టు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవని, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలోనూ పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు.

## రాహుల్ పర్యటనను ప్రతిష్ఠాకరంగా తీసుకున్న టీపీసీసీ

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటనను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికల త ర్వాత రాహుల్‌గాంధీ రాష్ట్రానికి రావడం ఇదే మొదటిసారి కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఈ నెల 6 వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కాబోతున్న సమగ్ర కులగణన కార్యక్రమానికి ముందు రోజు మంగళవారం సా యంత్రం రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారు. జారా□ండ్, మహరాష్ట్రలో జరిగే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ బిజిగా ఉం డటంతో ఆయన కేవలం తరువాయి 6లోగంటసేపు సమయాన్నే తమకు కేటాయించినట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం గాంధీభవన్‌లో మీడియాకు వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా కులగణన జరగాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తే కులగణన నిర్వహిస్తామని కూడా ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాలలో కులగణన నిర్వహించి ఈ అంశంలో తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని రాహుల్‌గాంధీ పట్టుదలతో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలలో కేంద్రంలో అధికారం చేపట్టడానికి చేరువదాకా వచ్చి కాంగ్రెస్ వైఫల్యం చెందింది. దీంతో వచ్చే 2029 సార్వత్రిక ఎన్నికలే టార్గెట్‌గా రాహుల్‌గాంధీ ఇప్పటి నుంచి ఉత్తరాది రాష్ట్రాలలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరవయ్యే దిశగా 'సంవిధాన్ సమ్మాన్' పేరిట పర్యటిస్తున్నారు.

## మేధావులు, ముఖ్యనేతలతో రౌండ్ టెబుల్ సమావేశం

రాహుల్‌గాంధీ పర్యటన నేపథ్యంలో గాంధీభవన్‌లో ఆదివారం టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మేధావి వర్గాలు, పార్టీ ముఖ్యనేతలతో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐసిసి పరిశీలకునిగా కొప్పుల రాజు హాజరయ్యారు. బోయిన్‌పల్లిలో జరుగబోయే సమావేశానికి టిపిసిసి నుంచి ఆహ్వానం అందుకున్న జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ కురపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ భూక్య రౌండ్ టెబుల్ సమావేశానికి హాజరై రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. పార్టీ ముఖ్య నాయకులు ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కోట నీలిమా, బెల్లయ్య నాయక్, ఒబేదుల్లా కొత్వాల్, రోహిన్‌రెడ్డి, ఫహీమ్ ఖురేషి తదితరులు రాహుల్ గాంధీ పాల్గొనబోయే సమావేశాన్ని విజయవంతం చేయడంపై చర్చించారు.

# వడ్లు కొనేదెప్పుడు?

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలరోజులు

## రైతుల ఉసురుపోసుకుంటున్న సీఎం

## మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం నెలరోజులైనా వడ్లు కొనుగోలు చేయడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర దక్కడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో వడ్లు కల్లాలకు రాకముందే సంచులు పంపించి, మిల్లర్లతో టైయ్యప్ చేపించి, ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేసి మరీ రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. కానీ రేవంత్ ప్రభుత్వం నెలరోజులైనా వడ్లు కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాల ప్రారంభంతో రైతులు వడ్లు తీసుకొచ్చి ఎదురుచూస్తున్నా కొనకపోవడంతో అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్నాయని, కోతులు, పందికొక్కులకు ఆహారం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల, మహబూబాబాద్, సూర్యాపేట, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో రైతులంతా రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారన్నారు. సీఎం రైతులను రోడ్డుపై పడేశారన్నారు. ఓట్లప్పుడు ఊరురా తిరిగిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు రైతుల దగ్గరికి వెళ్లట్లేదని ప్రశ్నించారు. సీఎం గానీ, మంత్రులు గానీ ఏ ఒక్కరూ రైతుల కష్టాలు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రెండు సార్లు రైతుబంధు ఇస్తే.. మూడుసార్లు ఇవ్వాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారని, ఇప్పుడు ఒక్కసారి కూడా రైతుబంధు ఇవ్వలేదన్నారు. రూ.7,521కు కొనుగోలు చేయాల్సిన పత్తి.. కేవలం రూ.5000కు రైతులు అమ్ముకుంటు న్నారన్నారు. పత్తికి మద్దతు ధర లేదని, మక్కల కొనుగోలు కేంద్రాలు లేవని, వడ్లు రూ 1800కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ కొనుగోలు చేసిన ప్రభుత్వం రెండు నెలలైనా డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. దాంతో చాలా మంది రైతులు దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. సిద్దిపేట జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో వానాకాలం వరి సాగు అయ్యిందని 9 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతాయని, కానీ ఇప్పటి వరకు అధికారులు వెయ్యి మెట్రిక్ టన్నుల వడ్లు కూడా కొనలేదన్నారు. రైతుల పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, రూ.500 బోనస్ ఇవ్వాలని, లేకపోతే



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఆనగోని లింగం గౌడ్, సొసైటీ చైర్మెన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధి



## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

వరంగల్ మహా నగరాన్ని రెండవ రాజధానిగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించా రు. నగర మేయర్ గుండు సుధారాణి, ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు నాయిని రా జేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి. ప్రావీణ్యతో కలిసి వరంగల్ నగరంలోని భద్రకాళి బండ్ సుందరీకరణ పనులు, భద్రకాళి చెరువు బొంది వాగు వరద నివారణ పనులు, భద్రకాళి మా డవీధులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సం దర్భం గా మంత్రి మాట్లాడుతూ..భద్రకాళి చెరువు ను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులలో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించా రు. భద్రకాళి చెరువు బొంది వాగు వరద నివారణకు ప్రభుత్వం రూ.158 కోట్లు మంజూరు చేసిందని, బొం ది వాగు నాలా, భద్రకాళి నాలా, భద్రకా ళి క్యాచ్‌మెంట్ ఏరియాలలో చేపట్టే వరద నివారణ కు సంబంధించిన అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలించారు. ఆయా వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని సమర్థవంతంగా ఆయా పనులు నిర్వహించేందుకు తగిన సూచనలు చేశారు.

మిగతా 7లో..

# యాదాద్రికి కార్తీక శోభ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసంలో వచ్చిన తొలి ఆదివారం కావడంతో స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తు లు తరలివచ్చారు. కొద్దిరోజులుగా ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉండగా ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హెూమం, నిత్యకల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవార్ల శీఘ్ర దర్శనం 4 గంటలు, అతిశీఘ్రదర్శనం 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.60, 82,772 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,86, 400, బ్రేక్ దర్శనం ద్వారా రూ. 5,68,000, విఐపి దర్శనం ద్వారా రూ.8,83,650, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,00,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,00, 064, ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 20,07,120, కల్యాణకట్ట ద్వారా రూ.1,25, 000తో పాటు వివిధ శాఖ, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం,
04-11-2024



## మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్ పాల్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

కంటేశ్వర్ అయ్యప్ప ఆలయంలో ఇందూర్ అయ్యప్ప సేవ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాన్నదాన కార్యక్రమాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రారంభించారు. మొదట అయ్యప్ప స్వామికి ప్రతేక పూజలు నిర్వహించి, అయ్యప్ప స్వాములకు బిక్ష వడ్డీంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు అయ్యప్ప మాల అంటేనే నిగ్రహానికి నిదర్శనం అని, కామ, క్రోధ, మదమత్సర్యాలను పంచెంద్రియలను అదుపులో పెట్టుకోవడం అన్నారు. ఇందూర్ నగరంలో ఉన్న అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకుంటే శబరిలో ఉన్న అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకున్న అనుభూతిని భక్తులు పొందుతారని అన్నారు. ఇందూర్ లో దాదాపు 30 ఏళ్ల నుంచి మాల దరిస్తున్న గుండమయ్య లాంటి గురు స్వాములు ఉన్నారని, ఇందూర్ ఆలయ నిర్మాణానికి వారు ఎంతో కృషి చేసారన్నారు. జనవరి 20 వరకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఇందూర్ అయ్యప్ప సేవ సమితి ట్రస్ట్ ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భక్తవత్సలం ఢిల్లీ, ట్రస్ట్ సభ్యులు సురేష్, ఆగమయ్యా, జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కుల గణనలో పాల్గొని విజయవంతం చేయాలి

### బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్

### బీసీ కులాల ఫెడరేషన్ నగర కమిటీ ఎన్నిక

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



సమగ్ర కుల గననలో బిసిలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుల గననలో బిసి కులాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా కార్యాలయంలో బిసి కులాల ఫెడరేషన్ - బికెఎఫ్ నిజామాబాద్ నగర కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గననలో 139 బిసి కులాల ప్రజలు తమ తమ కులాల జనాభా లెక్కల వివరాలను ఇంటింటికీ వచ్చే ఎన్యుమరేటర్లకు ఇవ్వాలని కోరారు. బిసి కులాల జనాభా లెక్కల వివరాలను బట్టి బిసి కులాల ఆర్థిక, సామాజిక అంతరాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన ఉంటుందని చెప్పారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా బిసి కులాలు తమ జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత మాట్లాడుతూ బిసి కులాల మహిళలకు రాజ్యాధికారంలో సమాన వాటా దక్కినప్పుడే బిసి కులాల మహిళల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. అనంతరం బిసి కులాల ఫెడరేషన్ - బికెఎఫ్ నగర కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జన్నేపల్లి సత్యనారాయణ (బిసి ఎ నాయి బ్రాహ్మణ), ప్రధాన కార్యదర్శిగా ఎనుగుల చంద్ర గౌడ్, ఉపాధ్యక్షులుగా మేకల స్వామి (కుర్మ బిసి బి), ఆశం స్వాతి (గంగ పుత్ర బిసి ఎ), డి. కిషోర్ - (బిసి బి అరెమరాఠ), ఈర్ల రాజేందర్ (బిసి డి ముదిరాజ్), లక్ష్మి (బిసి బి విశ్వకర్మ వడ్ల), సహాయ కార్యదర్శులుగా శంత బాయి (బిసి డి మున్నూరు కాపు), గంగా మణి (బిసి ఎ గంగ పుత్రు), రేఖా (బిసి ఎ రజక), మరో తొమ్మిది కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.

## సెపక్ తాక్రా అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడిగా సంజీవ రెడ్డి

### కార్యవర్గ సభ్యునిగా చామకూర బాగారెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

తెలంగాణ రాష్ట్ర సెపక్ తాక్రా అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన గాదరి సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్ లోని ఫాతే మైదాన్ క్లబ్ లో తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. కార్యవర్గ సభ్యుల అంగీకారం మేరకు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో నిజామాబాదు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న గాధరి సంజీవ్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, చామకూర భాగరెడ్డి కార్యవర్గ సభ్యునిగా ఎంపికైనట్లు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు, నూడా చైర్మన్ కేశ వేణు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సంజీవరెడ్డి, భాగరెడ్డి కార్యవర్గ సభ్యులు గా ఎంపిక పట్ల జిల్లా అధ్యక్షుడు కేశ వేణు, కార్యవర్గ సభ్యులు ల్యాబ్ గంగారెడ్డి, దీపిక, సతీష్ రెడ్డి, మీసాల ప్రశాంత్ కుమార్ వారిని అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

# నాసిరకం పనులపై గ్రామస్తుల ఆగ్రహం..

### వివరణ కోరిన విలేకరిపై దురుసుగా వ్యవహరించిన డీఈ

### కాంట్రాక్టర్ కు వంతపాడిన ఆర్అండ్ డీఈ

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి





రోడ్డుపైబ్రిడ్జి నిర్మాణం చేసే క్రమంలో నాసిరకం పనులు కళ్ళకు కట్టినట్టు లోపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోగా సదర్ కాంట్రాక్టర్ కు వంత పాడటంపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నాసిరకం నిర్మాణానికి ఆపాలని కోరిన ఆరైతులకు సదరు అధికారి వ్యహరించిన తీరును చూసి అవక్కాయ్యారు.ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో నిజాంసాగర్ డి 47/1నుండి వచ్చే సాగు నీరు,వరద నీరు ప్రవహించేందుకు వీలుగా ఉన్న ఫీడర్ కెనాల్ ఠాణాకలాన్ ప్రధానరహదారి నుండి వెళుతుంది.ఐతే వరదలు వచ్చినప్పుడు కెనాల్ నుండి వచ్చే నీటి ఉదృతికి రోడ్డు మొత్తం కోతకు గురై కెనాల్ కు దిగువన గల పంట పొలాలు నీట మునిగి ఇసుకమేటలు వేస్తున్నాయి.దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.సమస్యను పరిష్కరించాలని పలుమార్లు రైతులు కోరగా సంబంధిత ఆర్ అండ్ బీ అధికారులు పాత పైప్ లైన్ తొలగించి నూతనంగా పైప్ లైన్ వేసేందుకు గత సంవత్సరం క్రితం ప్రణాళికలు వేశారు.అయితే ఆదివారం ఓగుత్తేదారు నాసిరకంగా బ్రిడ్జి పనులు నిర్వాహస్తుండగా స్థానిక రైతులు అడ్డుకొన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. బ్రిడ్జి నిర్మాణ స్థలంలో నీళ్లలోనే సిమెంట్ మిశ్రమాన్ని వేయడం చూసిన గ్రామానికి చెందిన రైతులు ఆర్ అండ్ బీ డిఈ రాంమోహన్ కు, ఏఈ రఘువీర్ లకు పిర్యాదు చేసారు.దీంతో అక్కడికి చేరుకొన్న ఆ అధికారులు కాంట్రాక్టర్ చేస్తున్న నాసిరకం పనులకు అభ్యంతరం తెలిపి పనులు నిలిపివేయాల్సింది పోయి పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పడంతో రైతులు అవక్కాయ్యారు.పనులుఅలాగే చేయాల్సి ఉంటుందని తెలపడంతో దీనిపై స్థానిక ఓ విలేకరి ఆ అధికారిని వివరణ కోరగా ఆపాత్రికేయునిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దురుసుగా ప్రవర్తించాడు.తానేందుకు సమాధాన మివ్వాలి అంటూ దురుసుగా వ్యవహరించడంతో సదరు అధికారిపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## టైక్వాండో మాస్టర్ మనోజ్‌కు ఏలియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్

### సర్టిఫికెట్ అందజేసి ప్రశంసించిన జిల్లా జడ్జి సునీత కుంచాల



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్



నిజామాబాద్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మాస్టర్ కంచిపురం మనోజ్ కుమార్ ఏలియన్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకున్నాడు. సుమారు 12,000 మంది బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ లో అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వడం పట్ల ఆయనకు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో సుమారు 11 లక్షల మంది బాలికలు, మహిళలతో ఈ అవగాహన కల్పించి రికార్డును సృష్టించారు. దీంతో 2024లో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కింది. నేటి సమాజంలో మహిళలకు రక్షణ భద్రత కరువవుతున్న నేపథ్యంలో తమ ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ లోని టైక్వాండో ఎంతో దోహదపడుతుందని, దీనిపట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించి రికార్డులలో తన ముద్రను వేసుకునే విధంగా సహకరించిన జిల్లా జడ్జి సునీత ఉంచాలకు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ కు, టైక్వాండో చైర్మన్ బసవపురం లక్ష్మీ నరసయ్యకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లా బాలికల జట్లు ఖరారు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కు జిల్లా బాలికల క్రికెట్ అండర్- 17, అండర్ - 19 జిల్లా జట్లు ఖరారు అయినట్లు ఫిజికల్ డైరెక్టర్ కృష్ణంరాజు తెలిపారు. ఖమ్మం, హైదరాబాదులో వేరు వేరు వయోపరిమితులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల అండర్ -17 అండర్ -19 జిల్లా జట్లను ఎంపిక చేసినట్టు కృష్ణంరాజు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సారంగాపూర్ లో రాష్ట్ర బాలికల జట్టు ఎంపిక కోసం ఈ ఎంపికలు నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల నుంచి కుమార్ వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆట ప్రతిభ ద్వారా ఎన్నిక ఎంపిక జరిగినట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కే. లలిత మాట్లాడుతూ రాష్ట్ర జట్టు ఎంపిక కోసం సారంగపూర్ పాఠశాలను ఎంచుకోవడం గర్వకారణం అన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రతి కనబరచాలని విద్యార్థుల నిర్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ ప్రధాన కార్యదర్శి సల్ల సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీధర్ నాగరాజు, గోపిరెడ్డి ఉపాధ్యాయులు రాధాకృష్ణ, గోపాల్, గంగాధర్, జావిద్ పాల్గొన్నారు.

## గుండారం విద్యార్థి గంగ లక్ష్మికి రాష్ట్రస్థాయి కవితా బహుమతి

### అభినందించిన పాఠశాల ఉపాధ్యాయ బృందం



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ విద్యావిభాగం

పెందోట సాహిత్య పీఠం రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన కవిత రచన పోటీలో గుండారం ఉన్నత పాఠశాలకు చెందిన కె. గంగలక్ష్మికి ప్రోత్సాహక బహుమతి లభించినట్లు ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్ తెలిపారు. సిద్ధిపేట లోని పెందోట సాహితి పీఠం ఆధ్వర్యంలో గత మూడు నెలల క్రితం రాష్ట్రస్థాయి విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని చాలామంది విద్యార్థుల నుంచి కవితలు వచ్చాయి. వీటిలో నుంచి గుండారం పాఠశాలకు చెందిన కే. గంగలక్ష్మి రాసిన ప్రకృతి అనే కవితకు ప్రోత్సాహక బహుమతి లభించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి అభినందన సభలో ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్ మాట్లాడుతూ విద్యార్థులు కవితల పోటీల్లో రాణించడం చాలా ఆనందంగా ఉందన్నారు. గుండారం పాఠశాల రాష్ట్రస్థాయిలో కవితల పోటీలో రాణించి బహుమతులు అందుకోవడం అభినందనీయమని గంగ లక్ష్మి అభినందించారు. విద్యార్థులలో కవితా రచనల ప్రోత్సహిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ వారె దస్తగిరి, నరేంద్రమూర్తిలను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ నెలాఖరులో సిద్దిపేటలో జరిగే ఒక సాహిత్య కార్యక్రమంలో గంగలక్ష్మికి ఈ బహుమతిని నిర్వాహకులు పెందోట వేంకటేశ్వర్లు, సాహితీవేత్తలు అందజేయనున్నారు. ఈ విద్యార్థి అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అహల్య, గిరిధర్, ఆరోగ్యరాజ్, వినోద్ కుమార్, ప్రణీత, శుభ దేశ్ పాండే, భగవాన్ దాస్, అనిత, మోనీశ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో జిల్లా జట్టు ఛాంపియన్‌గా తిరిగి రావాలి



### జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మానస గణేష్

### రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ కు జిల్లా జట్లు ఖరారు

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

జిల్లాస్థాయిలో చూపిన ప్రతిభను స్పూర్తిగా తీసుకొని మరింత రెట్టింపు ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయిలోను జిల్లా జట్టును ఛాంపియన్ గా నిలబెట్టాలని నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మానస గణేష్ అన్నారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ లోని విజయ హై స్కూల్లో నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ మహిళా, పురుషుల జిల్లా జట్టు ఎంపికలు ప్రక్రియ జరిగింది. ఉమ్మడి జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న క్రీడాకారులను జట్లుగా విభజించి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్లు ఈనెల 8 నుంచి 11 వరకు హనుమకొండ జిల్లాలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే 70వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలలో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేషన్ అధ్యక్షుడు మానస గణేష్ ఎంపికైన జట్టు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అయితే మోర్తాడ్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో మహిళ జట్టుకు, రెంజల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో పురుషుల జట్టుకు సన్నద్ధ శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత దివాకర్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సభ్యులు నరేష్, సింధుజ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం,
04-11-2024


# వ్యక్తిత్వం హిమశిఖరం..!

- ఉన్నత చదువులు అభ్యసించి... ప్రజా సేవకై రాజకీయ క్షేత్రంలోకి
- రాజకీయాల్లో యువత ముఖ్య పాత్ర పోషించాలి
- అవినీతి లేని సమాజమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- నియోజక వర్గంలో ప్రజా సేవకై ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటూ...!







టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

రాజకీయాల్లోకి రావాలంటే తల పండిపోయి.. వృద్ధాప్యం దరిదాపుల్లో ఉన్న ఉద్దండులు కానవసరం లేదు.. కాసింత సేవాగుణం.. తాను పుట్టిన నేలకి సేవ చేయాలనే సంకల్పం ఉంటే చాలు అంటున్నారు ప్రస్తుత డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గునిగంటి కమలాకర్ ..ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలోని గుండం రాజుపల్లి లో పుట్టి పెరిగి మహబూబాబాద్ లో నివాసం ఉంటూ,ఎన్నో అవకాశాలను వదిలి తనకు జన్మనిచ్చిన నెలకు ఏమైనా చేయాలనే ఉత్సుకతతో పాటు.. అవినీతి లేని పాలన అందించాలని రాజకీయాల్లోకి వచ్చా నంటూ.. డోర్నకల్ నియోజక వర్గ అభివృద్ధికి పాటుపడుతూ పల్లెల్లో గిరిజన తండాల్లో ప్రతి ఒక్కరి గడప గడపకు వెళ్తూ కష్టం వచ్చిన ప్రతి గుండెకు భరోసా కల్పిస్తూ నేనున్నాను అంటూ ముందుకు సాగుతున్నారు. ఈ రోజుల్లో చిన్నపాటి చదువు చదివిన కూడా మంచి జీతంతో ఉద్యోగాలు చేయాలని భావించే యువత ఉన్న నేటి తరుణంలో.. తమ ప్రాంతానికి సేవ చేయాలని సంకల్పంతో.. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున తల పండిన రాజకీయ ఉద్దండులపై బరిలోకి దిగి ప్రాత్యర్థులకు ముచ్చెమటలు పట్టించిన గునిగంటి కమలాకర్ ఆనాడు ఓటమి చెందినా సరే అలుపెగక నేడు ప్రజా క్షేత్రంలో తనవంతు ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్నారు. తాను పుట్టిన ప్రాంతానికి ఏమైనా చేయాలనే ఉద్దేశ్యంతో అతి చిన్న వయస్సులోనే రాజకీయాల్లో తన వంతు మార్క్ సృష్టిస్తూ నియోజక వర్గంలో మెరుపు పర్యటనలు,ఓదార్పులు,శుభకార్యాలకు వెళ్తూ జనాల్లో మమేకం అవుతున్నారు. చిన్నప్పటి నుంచి బాగా చదువుకొని తమ ప్రాంతానికి ఉపయోగపడే విధంగా ఏదైనా చేయాలని కోరిక ఉండేదని.. చదువుకుంటూనే ఎన్నో రాజకీయ ఉద్యమాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు సొంతం. ఈ నేపథ్యంలో డోర్నకల్ నియజిక వర్గంలోని చిన్న గూడూరు మండల కేంద్రంలో ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత ప్రత్యక్ష రాజకీయాలలోకి రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి కోసం అవినీతి లేని సమాజాన్ని స్థాపించేందుకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో విజయ దుందుభి మోగించాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్‌కు ఎంపికైన కీర్తనకు అభినందనలు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ కు ఎంపికైన కల్లెడ జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థిని వై. కీర్తనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. నరేందర్ అభినందించారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలికల ఎంపికలలో అద్భుత ప్రతిభ కనబరిచిన కీర్తన జిల్లా జట్టులో చోటు సాధించింది. దీంతో ఈ నెల 4 వరకు మంచిర్యాల జిల్లాలోని అసిఫాబాద్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గట్టడి రాజేష్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలు తనిఖీ

టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్



వడ్లకొనుగోలు కేంద్రాలను, మాక్లూర్ పాథమిక సహాకార సంఘం అధ్యక్షులు బూరోళ్ల అశోక్ తనిఖీ చేశారు. మాక్లూర్ సహాకారకేంద్రపరిది డికంపల్లి, కల్లడి, గుత్ప, రాంచంద్రపల్లి గ్రామాల లో వడ్లకొనుగోలు కేంద్రలదగ్గరకువెల్లి,కాటా, (తూకం )లోడింగ్ చేయు విధానం పరిశీలించారు. ప్రతి గ్రామం నుండి వడ్ల లారీలను రైస్ మిల్లులకు తరలించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని రైతులకు సూచించారు. రైతులు స్వచ్ఛమైన దాన్యాన్ని కొనుగోలు కేంద్రల ద్వారా విక్రహించాలని, దీనివలన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని తెలియజేశారు. కార్యక్రమంలో ఈయనతోపాటు డైరెక్టర్లు రైతులున్నారు.

## ఏకలవ్య గురుకులంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

### దరఖాస్తు కోసం 12 వరకు చివరి గడువు

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ విద్యావిభాగం

నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి ఏకలవ్య గురుకులంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కాటరింగ్ అసిస్టెంట్ (01), మెస్ హెల్పర్ (02), శానిటేషన్ (01 మహిళ), ఎలక్ట్రిషియన్ కమ్ ప్లంబర్ (01) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కేటరింగ్ విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మెస్ హెల్పర్, శానిటేషన్ కోసం 10వ తరగతి, ఎలక్ట్రిషియన్ కమ్ ప్లంబర్ పోస్టుకు 10వ తరగతితోపాటు ఐటిఐ లేదా పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 12 లోపు ఇందల్వాయిలోని ఏకలవ్య గురుకులంలో సమర్పించాలని తెలిపారు. కొత్త నిజామాబాద్ జిల్లాలో పదవ తరగతి పూర్తి చేసిన బోనాఫైడ్ గల అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. పూర్తి మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తామన్నారు. ఇవి పూర్తి తాత్కాలిక పోస్టులని, రెగ్యులర్ ఉద్యోగుల నియామకం కొరకు ఇది వరకే నోటిఫికేషన్ విడుదలైందని వీరి తొలగింపు ఏ క్షణంలోనైనా జరగవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఇందల్వాయి ప్రిన్సిపల్ 83979 47334 ను సంప్రదించాలన్నారు. దరఖాస్తు అందజేయాల్సిన సమయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు విష్ణు, సురేష్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్



తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలకు ఇందల్వాయి కి చెందిన బానోత్ విష్ణు, భానోత్ సురేష్ ఎంపికైనట్లు పూర్వ ఫిజికల్ డైరెక్టర్ రాజ్ కుమార్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని ఇటీవల నిర్వహించిన అండర్ 19 కబడ్డీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు బానోతు విష్ణు, బానోతు సురేష్ అద్భుత ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ధర్పల్లి లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న విష్ణు, సురేష్ ఈ నెల 3 నుంచి 5 వరకు మహబూబ్నగర్ జిల్లా అడ్డాకల్ లో జరగనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులను కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఆముదాల లింగయ్య, గంగాధర్ రెడ్డి, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ రాజ్ కుమార్ తదితరులు అభినందించారు.

## మాక్లూర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్




మాక్లూర్ కేంద్రములో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్, నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యములో మాక్లూర్ ఎస్ ఐ రాజశేఖర్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భముగా సైబర్ నేరాల గురించి, రోడ్డు ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తుపదార్థలకు దూరంగా యుండి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పక హెల్మెట్ ధరించాలని హెల్మెట్ దరించడం వలన చాలావరకు ప్రాణాప్రాయం నుండి రక్షించుకోవచ్చని తెలియజేశారు. తాగి వాహనాలు నడిపిస్తే బారి జరిమానాలతో పాటు జైలు శిక్ష ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సయ్య, కానిస్టేబుల్స్ వీడిసి కమిటి, గ్రామ పెద్దలు యువకులు ఉన్నారు .

# దేశాన్ని కాపాడేది కమ్యూనిస్టులు మాత్రమే

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:



మతోన్మాద, ఫాసిస్టు, కార్పోరేట్ శక్తుల ప్రమాదం నుండి దేశాన్ని కాపాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ లు తెలిపారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో కాంటా చౌరస్తాలో ని అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ సెమినార్ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అదేవిధంగా జిల్లాలోని నెన్నల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిల భారత మహిళా సమాఖ్య జిల్లా నాయకులు దుర్గం లక్ష్మీ, కామెర పద్మ ల ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నవంబర్ 7న హైదరాబాద్ లోని సుందరయ్య భవన్ లో యంసిపిఐ(యు)పార్టీ ఆధ్వర్యంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-మతోన్మాద ఫాసిస్టు కార్పోరేట్ శక్తుల ప్రమాదం-వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం అనే అంశంపై జరుగు జాతీయ సెమినార్ ను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన కొన సాగిస్తూ కార్మికుల హక్కులను కాల రాస్తుందని, 44 చట్టాలను 4 కోడ్ లుగా క్రోడీకరించిందని ఆరోపించారు. మణిపూర్ లాంటి రాష్ట్రంలో ఈనాటికి విధ్వంసం జరుగుతున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని మార్చకుండా, శాంతి భద్రతలకు భంగం కలుగచేస్తున్నారని,మహిళలకు భద్రత కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. మతాల,కులాల మధ్య చిచ్చులు పెడుతూ హత్యలకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. విద్య,వైద్యం తదితర రంగాలకు సంబందించి కార్పొరేట్ శక్తులైన ఆదాని, అంబాని వారికి అప్పనంగా అప్ప చెబుతున్నారన్నారు. నవంబర్ 7న జరుగు జాతీయ సెమినార్ లో విద్యార్థి, యువజన, మహిళ, కార్మిక, కర్షక, కవులు,మేధావులు,అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యకమంలో కందుల లక్ష్మణ్,నారాయణ, మల్లయ్య, రాజారామ్, అన్వేష్, ఆనంతరావు, దుర్గం మొండి, విస్తారి,బానయ్య లు పాల్గొన్నారు.

## కార్మికుల అనుమతితోనే చందా రికవరీ చేయాలి



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:

సింగరేణి యాజమాన్యం కార్మికుల అనుమతి లేకుండా వేతనాల నుండి యూనియన్ చందా పేరిట డబ్బులు ఎలా రికవరీ చేస్తారని, కార్మికుల అనుమతితోనే చందా రికవరీ చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి మంద నరసింహారావు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘానికి కొంతమంది కార్మికుల వారి అనుమతులు లేకుండా అక్టోబర్ నెల వేతనం నుండి ఒక్కొక్కరికి 500 రూపాయల చొప్పున టెంపుల్ రికవరీ కోడ్ 1835 పై వేతనాన్ని రికవరీ చేసినట్లుగా తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. కార్మికుని అనుమతితో అతని జీతం నుండి యూనియన్ చందా కొరకు 1875 యూనియన్ కోడ్ మీద రికవరీ చేయాలే తప్ప కార్మికుల అనుమతి లేకుండా టెంపుల్ కమిటీ కోడ్ 1835 పేరిట రికవరీ చేయడం యాజమాన్యానికి తగదన్నారు. కార్మికుల రికవరీకి సంబంధించిన ఆథరైజేషన్, స్టేట్మెంట్ తో సరిచూడకుండా, వేతనాల నుండి డబ్బులు రికవరీ చేయడం సరైన పద్ధతి కాదని, దీనికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఎవరైతే ఆథరైజేషన్ రికవరీ కొరకు అనుమతించలేదో యాజమాన్యం పూర్తి తనిఖీ చేసుకొని, వారందరికీ ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి విషయాలలో పారిశ్రామిక సంబంధాలు దెబ్బతిని, ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యంపై ఉందని తెలిపారు.

## ఫుట్ ఓవర్ వంతెన ఏర్పాటు చేయాలి

### అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో ఎంపీ కి వినతి పత్రం

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:



పట్టణంలోని యాపల్ ప్రాంతంలో జాతీయ రహదారిపై ప్రజల సౌకర్యార్థం ఫుడ్ ఓవర్ వంతెన ఏర్పాటు చేయాలని ది నేషనల్ అంబేద్కర్ సేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలో పర్యటించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో జాతీయ రహదారి ఏర్పాటు వలన ఎర్రగుంటపల్లి, యాపల్, రామాలయం, పోచమ్మ బస్తీ, అంగడి బజార్, సెగ్యం బస్తీ వాసులకు బెల్లంపల్లి, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ లాంటి పట్టణాలకు వెళ్లడానికి రోడ్డు దాటడానికి ఇలాంటి సౌకర్యం లేదని తెలిపారు. దీనివల్ల ప్రజలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలు, విద్యార్థులు, ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగపిండి రాజేష్ కుమార్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పసుపునూటి రమేష్, జిల్లా ముఖ్య సలహాదారులు తుంగపిండి రాము, జిల్లా కోఆర్డినేటర్ గోర్కాటి సురేష్, మండల అధ్యక్షుడు జూల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొలిపాక సాంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి దూడపాక శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## గౌతమేశ్వరాలయంలో ఘనంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన

### హాజరైన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:

జిల్లా కేంద్రమైన మంచిర్యాల గోదావరి నది తీరంలోని గౌతమేశ్వరాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన నవగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా ప్రారంభించారు. ఈకార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్ రావు హాజరై నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దాతల సహాయ సహకారంతో ఆదివారం గణపతి పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమై నవగ్రహ విగ్రహాలను వేధ మంత్రోచ్చారణతో పూల, జలాధివాసం నిర్వహించి అనంతరం హెూమ మంటప ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమాలను నవగ్రహ విగ్రహ ప్రతిష్టాచార్యులు సీతారాం శర్మ, గడియారం బాలాజీ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా సోమవారం నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవంతో పాటు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ఫౌండర్ శ్రీదేవి, పడకంటి శ్రీనివాస్, కేశెట్టి వంశీకృష్ణ, నకిరే కొమ్ముల రాజేంద్ర ప్రసాద్, సిరిపురం రాజేష్, ముక్త శ్రీనివాస్, కటకం హరీష్, మాదంశెట్టి సత్యనారాయణ, చిలువేరు వైకుంఠం, చిలువేరు శ్రీనివాస్, రాచర్ల చంద్రశేఖర్, పుల్లూరి బాలమోహన్, కొంకుముట్టి వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో పెరిగిన వాయు కాలుష్యం

వాయు కాలుష్యం డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గత 72 గంటల్లో సిటీలో గాలి నాణ్యత క్షీణించింది. టపాసులు భారీగా కాల్చడంతో కాలుష్యం పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 10 శాతం కాలుష్యం ఎక్కువైందని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో 171 గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదు కాగా కాప్రా, బొల్లారం, పటాన్‌చెరు, సోమాజిగూడ, సనత్ నగర్ అధికంగా వాయు కాలుష్యం పెరిగింది. రాష్ట్ర రాజధానిని వాయు కాలుష్యం కమ్మేస్తోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ప్రకారం హైదరాబాద్‌లో 171 ఏక్యూఐ నమోదైంది. ఢిల్లీ తరహాలోనే హైదరాబాద్‌లో వాయు కాలుష్యం పెరిగిపోతుండటం నగరవాసులను కలవరపెడుతోంది.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం,
04-11-2024


# ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీల ఏర్పాటు

### లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ సోత్కు సుదర్శన్




**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:**

పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆఫ్ మందమర్రి ఆధ్వర్యంలో 12 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయడం జరిగిందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సోత్కు సుదర్శన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ లో బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ, 12 సిమెంట్ బెంచీలలో తొమ్మిది పాత బస్టాండ్ లో ఏర్పాటు చేయగా మిగిలినవి మున్సిపల్ కార్యాలయం ఎదురు గల బస్టాప్ సమీపంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రపంచ వ్యాప్తంగా 210 దేశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ కొట్ల అనిత, లయన్స్ క్లబ్ మందమర్రి అధ్యక్షుడు కొక్కుల మధు, కార్యదర్శి సోత్కు రత్న జానకి, మొదటి ఉపాధ్యక్షుడు పెండ్యాల గౌతం చారి, సభ్యులు కొక్కుల కేదారి, మొగల్ రమేష్, ఎండి నిజాం, నోముల ఉపేందర్ గౌడ్, ఎండి హాఫీస్, చంద్రయ్య, జక్కుల శేఖర్, ఉదయ్ రాజు, కొమురయ్య, ఎండి సుకూర్ రమేష్ లు పాల్గొన్నారు.

## జీవన్ ప్రమాణ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:**



సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులందరూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం సైతం నవంబర్ మాసంలోనే పెన్షన్, సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డు రెన్యువల్ కోసం లైవ్ సర్టిఫికెట్ (జీవన్ ప్రమాణ్) కు దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి, ఏరియా కార్యదర్శి అల్లి రాజేందర్ లు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీవన్ ప్రమాణ్ కు దరఖాస్తు చేసుకొని పక్షంలో ప్రతి నెల వచ్చే పెన్షన్ ఆగిపోతుందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం సహాయం అందకుండా ఇబ్బందులు కలిగించే విధంగా ఉంటాయని సూచించారు. ప్రతి ఒక్క రిటైర్డ్ ఉద్యోగి, వారి భార్య ఇద్దరు వారి ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్ బుక్ లు, పెన్షన్ ఆర్డర్ కాపీ లు తీసుకొని, స్వయంగా దగ్గర్లో ఉన్న మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాలకు వెళ్లి జీవన్ ప్రమాణ్ ను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

## నాలుగవ తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:**

నాలుగవ తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమీత్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం సమస్యలపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కు ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమీత్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు ఉద్యోగుల సమస్యలు వివరించడం జరిగిందని, అదేవిధంగా పట్టణంలోని కాలేజీ రోడ్లో యూనియన్ స్థలం గురించి వారి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేగా సానుకూలంగా స్పందించి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి యువకుని ఆత్మహత్య

**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:**



పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగడి బజార్ కి చెందిన కోయల్కర్ భరత్ (28) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భారత్ శనివారం గడ్డి మందు తాగి, ఆత్మహత్య యత్నానికి పాల్పడగా, అది గమనించిన అతని కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు భారత్ బిటెక్ పూర్తి చేసి, సాఫ్ట్ వేర్ ఉద్యోగం కోసం పలుమార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లి, ఎలాంటి ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపం చెంది, ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈసంఘటనపై మృతుని బాబాయి కోయల్కర్ మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తెలిపారు.

## నాగులవంచలో నేషనల్ బ్యాంకుకు కృషి చేస్తా

### పార్లమెంట్ సభ్యులు రఘురామిరెడ్డి




**టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని**

మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో నేషనల్ బ్యాంక్ ఐన ఎస్బిఐ ఏర్పాటుకు కృషి చేస్తానని పార్లమెంట్ సభ్యుడు రఘురామిరెడ్డి హామీ ఇచ్చినారు. నాగులవంచ గ్రామానికి చెందిన రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య రఘు మా రెడ్డిని కలిసి నాగులంచలో నేషనల్ బ్యాంక్ లేకపోవడం వలన చాలా ఇబ్బందిగా ఉందని, అనేక గ్రామాలకు కూడలి అయిన నాగులవంచలో బ్యాంక్ ఏర్పాటు చేయాలని పార్లమెంట్ సభ్యులు దృష్టికి తీసుకురాగా తప్పనిసరిగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు .

# ఐటి కోతల వెతలు తీరేదెన్నడు..?

- ప్రారంభమైన ఐటి కోతలు
- బెంబేలెత్తున్న కార్మికులు
- భోజనాలకు, బోనస్ లకు ఉన్న ప్రచారం ఐటి కోతలకేవి






**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:**

సింగరేణి కార్మికులకు అక్టోబర్ మాసం వేతనాల నుండి అధిక మొత్తంలో ఐటి కోతలు ప్రారంభమయ్యాయి. భారీ ఐటి కోతలతో సింగరేణి కార్మిక వర్గం బెంబేలెత్తుతున్నారు. సుమారు మూడు నుండి నాలుగు నెలల వేతనాలు ఐటి పేరిట పాలక ప్రభుత్వాలు కార్మికుల వేతనాల నుండి కోతలు విధిస్తుంది. ఎన్నికల సమయంలో కార్మికులను బార్డర్ లో సిపాయిలతో పోల్చుతూ, కార్మిక శ్రేయస్సుకు కట్టుబడి ఉన్నామని చెబుతున్న రాజకీయ పార్టీల ప్రచారం ఎన్నికల వరకే పరిమితమవుతు న్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు ఐటీ వెతనాల నుండి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పాలక ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఒక మాట, ఎన్నికల అనంతరం మరో మాట చెబుతూ కాలం వెళ్లదీస్తూ వస్తున్నాయి. కార్మికులను బార్డర్ లో సైనికులతో పోల్చినప్పుడు వారికి కల్పించినట్టు కార్మికుల సైతం ఐటి కోతల నుండి మినహాయింపు కల్పించాలని డిమాండ్ కార్మిక వర్గం నుండి బలంగా వినిపిస్తోంది. గత 11వ వేతన ఒప్పందంలో కార్మికుల వేతనాలు భారీగా పెరిగినప్పటికీ ఆ ఫలాలు పూర్తి స్థాయిలో కార్మిక వర్గానికి అందకుండా, ఐటీ కోతల రూపంలో మరల తిరిగి ప్రభుత్వాలకే చేరుతుండటం గమనార్హం.గత నెల సింగరేణి బొగ్గు గని కార్మికులకు బోనస్ ల పేరిట అధిక మొత్తంలో లబ్ధి చేకూరిందని జోరుగా ప్రచారం నిర్వహించగా, కార్మికుల కష్టార్జితంతో సంస్థకు వచ్చిన లాభాలు నుండి బోనస్లు చెల్లిస్తుంటే, బోనంజాలంటూ, గనులపై భోజనాలు పెడుతుంటే వాటిపై ప్రచారం నిర్వహించిన వారు ఈ నెల నుండి అధిక మొత్తంలో కార్మికుల వేతనాలు నుండి ఐటీ పేరిట కోతలు పడుతుంటే, ఐటీ కోతలపై ఎందుకు ప్రచారం నిర్వహించడం లేదని కార్మిక వర్గం ప్రశ్నిస్తుంది.గత కొన్ని సంవత్సరాలు బొగ్గు గని కార్మికులకు ఐటీ మాఫీ డిమాండ్ ఎన్నికల హామీ లాగే మిగిలిపోవడం పై కార్మిక వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తుంది.

### అమలు కాని కోలిండియా ఒప్పందం

బొగ్గు గని కార్మికులకు ఐటి మాఫీ తీరని కలగా మిగులుగా, 2011సంవత్సరంలో పెర్క్స్ అలవెన్స్ లపై ఐటిని యాజమాన్యాలు తిరిగి చెల్లించేలా ఒప్పందం జరిగింది.దీని పై కోలిండియా యజమాన్యం ఉత్తర్వులు జారీ చేసి,అక్కడ అమలు చేస్తుంది.సింగరేణిలో మాత్రం ఈ ఒప్పందాన్ని గత 4,5 సంవత్సరాలుగా అధికారులకు అమలు చేస్తున్న యాజమాన్యం కార్మికులకు అమలు చేయడం లేదు.ఒప్పందాన్ని అమలు చేయించడంలో అప్పటినుండి సింగరేణిలో గెలిచిన కార్మిక సంఘాలు వైఫల్యం చెందాయని విపక్ష కార్మిక సంఘాలు బహిరంగంగా ఆరోపిస్తున్నాయి. అలవెన్స్ లపై ఐటి తిరిగి చెల్లించే ఒప్పందం అమలు అయినట్లైతే కార్మికులకు కొంతమేర ఉపశయనం లభించే అవకాశం లేకపోలేదు.

### క్వార్టర్ ఉన్న కార్మికులకు మరింత ఐటీ భారం

సింగరేణిలో క్వార్టర్ కలిగి ఉన్న కార్మికులకు మరింత ఐటి భారం పడుతుంది.ప్రతిఏటా కంపెనీ క్వార్టర్ కలిగి ఉన్న ఉద్యోగికి ఐటీ రిటర్న్ ఫామ్ 12బి లో విద్యుత్, నీటి, చార్జీలు, గ్యాస్ చార్జీల పేరిట యాజమాన్యం కార్మికుల జమ చేయకుండా ఐటీ ఫాంలో చూపించడంతో కార్మికులకు ఐటి స్లాబ్ పెరుగుతుంది. ఈ విషయంపై చాలామంది కార్మికులకు కనీస అవగాహన సైతం లేదు. దీంతో కార్మికులకు ప్రతిఏటా వేల రూపాయలు ఐటీ చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్మికులకు 11వ వేతన ఒప్పందంలో పెరిగిన వేతనాల వలన సంవత్సరంలో సుమారు 4,5 నెలల వేతనాన్ని ఐటి కి చెల్లించాల్సిన పరిస్థితి కలదు. కాగా పెర్క్స్ అలవెన్స్ లపై ఐటీ అధికారులకు తిరిగి చెల్లిస్తున్న యాజమాన్యం అదే ఒప్పందం మేరకు కార్మికులకు చెల్లించడం లేదు. కార్మికులకు, అధికారులకు యాజమాన్యం అందిస్తున్న సదుపాయాలకు ఐటి పడుతుండగా, వాటిని అధికారులు తిరిగి చెల్లిస్తున్న యాజమాన్యం కార్మికులకు చెల్లించకపోవడం కార్మికుల పట్ల సింగరేణి పక్షపాత ధోరణికి నిదర్శనమని పలువురు కార్మిక సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

### ఐటి తిరిగి చెల్లింపు ఉత్తర్వులకై కార్మికుల ఎదురు చూపు

కోలిండియాలో అమలు కానీ ఒప్పందాలు సింగరేణిలో అమలు చేస్తున్నామని చెబుతున్న గెలిచిన సంఘాలు,అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, ఒప్పందం జరిగి,కోలిండియాలో అమలు అవుతున్న అలవెన్స్ లపై ఐటి తిరిగి చెల్లింపు ఒప్పందాన్ని ఎందుకు సింగరేణిలో అమలు చేయడం లేదని ప్రతిపక్ష కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కోలిండియాలో అధికారులకు, కార్మికులు అమలు చేస్తుండగా,సింగరేణిలో మాత్రం సింగరేణి స్ఫూర్తికి విరుద్ధంగా అధికారులకు మాత్రం గత 5 సంవత్సరాలుగా అమలు చేస్తూ, కార్మికులకు అమలు చేయకుండా యాజమాన్యం ద్వంద వైఖరిని అవలంబిస్తున్నందని కార్మిక వర్గం ఆరోపిస్తుంది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో పోరాడే సంఘం గా ప్రచారం నిర్వహించి, గెలుపొందిన గుర్తింపు సంఘం ఏఐటియుసి, కార్మిక హక్కులు తమతోనే సాధ్యమంటూ ప్రచారం నిర్వహించిన అధికార పార్టీ అనుబంధ సంఘమైన ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టియుసి, ఎన్నికల సమయంలో కార్మికులపై ఎనలేని ప్రేమ ఒలకబోస్తూ కార్మికుల శ్రేయస్సు తమతోనే సాధ్యమని ప్రచారం నిర్వహించి, ఓట్లు దండుకొని గెలిచిన అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పెర్క్స్ అలవెన్స్ లపై ఐటి తిరిగి చెల్లింపు ఉత్తర్వులను వెంటనే విడుదల చేసి,కార్మికులకు పడుతున్న ఐటి భారం నుండి కొంతైన ఉపశమనం కలిగించాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్ పై గెలిచిన, పోరాడి సంఘమును చెప్పుకుంటున్న గుర్తింపు సంఘం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులను నిలదీయాలని ప్రతిపక్ష కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి. అతి త్వరలో నిర్వహించనున్న స్ట్రక్చరల్ సమావేశంలో పెర్క్స్ పై ఐటి తిరిగి చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్టియుసి సంఘాలు ఒత్తిడి తీసుకువచ్చి, సాధించాలని కార్మిక వర్గం నుండి బలంగా వాదనలు వినిపిస్తున్నాయి.

### ఐటీ శాఖ నోటీసులతో కొందరికి కోతల వెతలు

ఇటీవల కొంతమంది యువ కార్మికులకు ఆధార్ పాన్ కార్డు లింకు లేదని పెద్ద ఎత్తున ఐటీ శాఖ యాజమాన్యానికి పంపించిన నోటీసుతో పెద్ద ఎత్తున రికవరీ అవుతున్నది ఆధార్ కార్డు లింక్ చేసుకోవాలని పూర్తిస్థాయిలో ఐటి శాఖ కాని ఇటు సింగరేణి యాజమాన్యం గానే పూర్తిస్థాయి అవగాహన కల్పించకపోవడం దీనికి మూలమని అందుకే గనుల పైన ఐటీ రిటర్న్ ముందు నుండి చేయించాలని ప్రతిపక్షాలు అంటున్న పనిచేసిన పెడుతూ చివరి సమయంలో మమ అనిపించేలా రిటర్న్ చేంజ్ సరిపెట్టుకుంటున్నది యాజమాన్యం. అందుకే యాజమాన్యం ఉద్యోగంలో చేరేటప్పుడు కార్మికునికి కావాల్సిన సర్టిఫికెట్లు తీసుకునేటప్పుడు వీటిపై అవగాహన కల్పించాలని అవసరమైతే బాధ్యత తీసుకొని ఇలాంటి ఆర్థిక అంశాల పట్ల తన వంతు పాత్ర పోషించాలని పలువురు కోరుకుంటున్నారు. ఈనెల నుండి భారీగా ఐటి రికవరీతోపాటు ఆధార్ పాన్ కార్డు లింక్ లేని కార్మికులకు చేస్తున్న రికవరీలు తో కొత్త యువ కార్మికులకు కొందరికి ఇంటికి జీతం సైతం పోస్టు స్థాయిలో పోలేని పరిస్థితి నెలకొన్న దాని పలువురు బాధపడుతున్నారు.

## గుడి పేరుతో గుర్తింపు సంఘానికి చందాను ఖండిస్తున్నాం



**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:**

సింగరేణి కార్మికుల అనుమతితో అన్ని కార్మిక సంఘాలకు సభ్యత్వం తీసుకునే హక్కు ఉందని, కానీ యాజమాన్యం గుడి చందా పేరుతో గుర్తింపు సంఘానికి కార్మికుల సంతకాలు లేకుండా గంపగుత్తగా వసూలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం సరికాదని, హెచ్ఎంఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఖండిస్తుందని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్(హెచ్ఎంఎస్) ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్, నాయకుడు ఎర్ర శ్రీనివాస్ రెడ్డి లు తెలిపారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దీపావళి బోనస్ చర్చల్లో హెచ్ఎంఎస్, సిఐటియు, ఏఐటియుసి, బిఎంఎస్ నాలుగు జాతీయ సంఘాలు కోలిండియా యాజమాన్యంతో ఢిల్లీలో జరిగిన చర్చల్లో పాల్గొని గత సంవత్సరం 85,500 రూపాయల నుండి 93,750 రూపాయలకు మెరుగైన దీపావళి బోనస్ 8,250 రూపాయలు ఎక్కువగా ఇప్పించడం జరిగిందన్నారు.కార్మికుల అనుమతిలేకుండా వసూలుచేయడం సరికాదన్నారు. చట్ట ప్రకారము కార్మికుల వద్దకు వచ్చి, కార్మికులను మెప్పించి, వారి అనుమతితో సభ్యత్వ రుసుమును చేసుకోవాలని ఉన్నప్పటికీ, చట్ట విరుద్ధంగా కార్మికులకు తెలియకుండా, కార్మికుల అనుమతి లేకుండా యాజమాన్యంతో కుమ్మక్కై గుడి పేరుతో 500 రూపాయలను ఏఐటీయుసీ సంఘం తీసుకొని ఘరానా మోసానికి పాల్పడిందని ఆరోపించారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని 420 కేసు ఏఐటీయుసీ నేతలపై నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి 1835 అనే కోడ్ దేవాలయానికి సంబంధించిన లావాదేవీలను సూచిస్తుందని, 1875 కోడ్ మాత్రమే యూనియన్లకు సంబంధించిన సభ్యత్వ రుసుమును వసూలు చేసుకోవడానికి చట్టం అవకాశం కల్పించిందని, నేరుగా కార్మికుల వద్ద చందా అడిగే దమ్ము లేక ఏఐటీయుసీ నాయకులు దొడ్డిదారిన గుడి పేరుతో పైసలు వసూలు చేయడాన్ని సింగరేణి కార్మిక వర్గమంతా ఏఐటీయుసీ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. దొడ్డి దారిన కార్మికుల వేతనాల నుండి రికవరీ చేయించుకున్న 500 రూపాయలను వెంటనే కార్మికుల ఖాతాలోకి జమ చేయాలని డిమాండ్ చేశారు.

## గృహిణులపై ఇంటా, బయట హింసలు

### సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది డా. రాజలింగు మోతె

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:**



గృహిణులపై ఇంటా, బయట హింసలు రోజురోజుకూ అధికమవుతున్నాయని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది డా. రాజలింగు మోతె ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జాతీయ గృహిణిల దినోత్సవం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా గృహిణిల దినోత్సవం జరుపుతూ, వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతూ, అభినందనలు తెలుపుతూ ఉన్నా, నేటికి దేశంలో 90 శాతం మంది మహిళలు వెట్టిచాకిరి వలలో జీవితాలు గడుపుతున్నారన్నారు. మహిళలకు ఎన్ని సామర్థ్యాలు ఉన్నా వారు ఎదగలేక పోవడానికి పలు కారణాలు ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు లేదా తాను ఇష్టపడిన వ్యక్తిని వివాహం చేసుకొని, ప్రతిక్షణం తన జీవితాన్ని తన కుటుంబం కోసమే వెచ్చిస్తూ, తాను వెలుగుతూ, కరుగుతూ తన జీవితాన్ని అర్పించే గృహిణిల త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. గృహిణిలు అంటే వంటింటికే పరిమితం అనే భావన నుంచి బయటపడాలని, వారి శ్రమలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కష్టసుఖాల్లో చేదోడువాదోడుగా ఉండాలని,సమాన అవకాశాలు, హక్కులు కల్పించాలని తెలిపారు. కుల, మత, లింగ ఆధారంగా మహిళలను అణచివేయరాదని, మహిళలకు చదువుకునే హక్కు, ఉద్యోగం చేసే హక్కు ఉందని, అనేక హక్కులు, చట్టాలు ఉన్నాయని తెలిపారు. వరకట్న నిషేధ చట్టం, నిర్భయ చట్టం మొదలైన చట్టాలు వచ్చినా మహిళలకు రక్షణ, భద్రత లేకుండా ఎక్కడ చూసినా మహిళల పట్ల వివక్షత,లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా కుటుంబాల్లో వెలుగు చూడని మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు అనేకంగా ఉన్నాయని, ముఖ్యంగా వరకట్న వేధింపులతో ఆత్మహత్య చేసుకుంటున్న మహిళలు, వారి తల్లిదండ్రుల కడుపు కోత, అనాధలుగా మిగులుతున్న వారి పిల్లలకు రక్షణ ప్రశ్నార్థకమన్నారు. ఇలా అనేక విధాలుగా మహిళలపై జరుగుతున్న హింసా, దాడులపై పాలకులు, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం, 04-11-2024


## బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో కార్తీకమాస ప్రత్యేక పూజలు ప్రారంభం..



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలకు కార్తీక మాస ప్రత్యేక సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ఎన్ని రోజులపాటు పూజలు నిర్వహించనున్నట్లు అయ్యప్ప ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 5 గంటలకు ప్రత్యేకపూజలుప్రారంభమవుతాయని ,పూజలో పాల్గొనే భక్తులకు అభిషేకాలకు సంబంధించిన పూజా సామాగ్రిని ఆలయ కమిటీ తరపునఉచితంగా అందించనున్నట్లు వారుపేర్కొన్నారు. బాన్సువాడ పట్టణంలోని భక్తులు, హిందూ బంధువులందరూ పెద్దసంఖ్యలో హాజరై, ఈసదాఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, శివపార్వతుల కృపకు పాత్రులు కావాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివ భక్తులతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు తేలుకుంట్ల శ్రీధర్ గుప్తా తో పాటు మాత స్వాములు, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రతి గింజను కొంటాం.. రైతన్నను ఆదుకుంటాం

### రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:





రాష్ట్రం లో ఎక్కడ లేనివిధంగా రైస్ మిల్లలోర్లను ఒప్పించి ప్రతి గింజను కొంటు న్నామని బాన్సువాడ వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఆదివారం బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని బాన్సువాడ, నాగారం, కిష్టపూర్, దేశాయ్ పెట్ గ్రామాల్లో వరిదాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూ బాన్సువాడ నియోజక వర్గం లోని రైస్ మిల్లుల యజమానులతో మాట్లాడి ధాన్యం తీసుకునేల్ ఒప్పించడం జరిగిందన్నారు. తెలంగాణ లోనే అత్యధిక దిగుబడి సాధించే బాన్సువాడ రైతులకు ఇబ్బంది కలగకుండా రైస్ మిల్లర్ల యజమానులు ధాన్యం తీసుకుంటామని ఒప్పుకున్న వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని,అధికారులు అందరూ అందుబాటులో ఉంటూ రైతుల ధాన్యం రైస్ మిల్లులకు తరలించేలా చూడాలని అన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలిసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో బాన్సువాడ నియోజకవర్గం లో రాష్ట్రం లో ఎక్కడ లేకపోయినా ఇక్కడ రైస్ మిల్లర్లను ఒప్పించి ధాన్యం కొనుగోలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఎరవల కృష్ణారెడ్డి, నాయకులు చిన్న వెంకన్న ,మోహన్ నాయక్, నార్లఉదయ్కుమార్ ,రాచప్ప,తదితరులు, పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా ధర్మ యుద్ధ మహాసభకు

### బాన్సువాడ నుండి బయలుదేరి వెళ్లిన నాయకులు, కార్యకర్తలు

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈ ఎస్ ఆర్ గార్డెన్ లో ఎమ్మార్పీఎస్ ధర్మ యుద్ధ మహాసభలో పాల్గొనడానికి ఆదివారం బాన్సువాడ తోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలు గ్రామాల నుండి నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రత్యేక వాహనాల్లో భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేసి మార్గదర్శకం చేయనున్నట్లు వారి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుప్రీంకోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ అమలైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత అని ప్రకటించినప్పటికీ, ఆగస్టు 1న రేవంత్ రెడ్డి అసెంబ్లీలో నేను ముందు ఉంటానని ,దేశంలో డీఎస్సీ ఫలితాలు వెలువడక ముందే వర్గీకరణ అమలు చేసి తీరుతానని నిండు అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ ఆ ప్రకటన కు విలువ లేకుండా పోయింది, ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే డీఎస్సీ ఫలితాలు ప్రకటించి మాదిగలకు, మాదిగ జాతి ఉప కులాలకు ద్రోహం చేసినందుకు తగిన రీతిలో బుద్ధి చెప్తావని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణంతోపాటు బాన్సువాడ డివిజన్, నియోజకవర్గం లోని అన్ని మండలాల నుండి ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రత్యేక వాహనాల్లో భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్లి, ఎమ్మార్పీఎస్ ధర్మ యుద్ధ జిల్లా మహాసభను దిగ్విజయం చేశారు.



## ప్రభుత్వం ముఖ్య సలహాదారులు మహమ్మద్ అలీ షబీర్‌ని కలిసిన పెద్ద పట్లోళ్ల దేవేందర్ రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు మహమ్మద్ అలీ షబీర్‌ని ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటర్ నిర్వహించిన కుల గణన కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిసిన బోర్లం గ్రామం మాజీ ఎంపీటీసీ, మ లి దశ తెలంగాణ ఉద్యమ కార్ల ఫోరం డివిజన్ ముఖ్య సలహాదారులు పెద్ద పట్లోళ్ల దేవేందర్ రెడ్డి. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

## పొతంగల్‌లో వాలీబాల్ టోర్నీ ప్రారంభం



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండల కేంద్రంలో పి.ఎస్.ఆర్, కె.బి.ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ను మాజీ జడ్పిటిసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూప్పల శంకర్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ రెండురోజుల పాటు కొనసాగుతుందని ఆర్గనైజర్లు పేర్కొన్నారు. విజేతకు ప్రథమ బహుమతిగా 11, 1 11, రన్నర్ కు ద్వితీయ బహుమతిగా 5,5 55, రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, విండో చైర్మన్ శాంతిశ్వర్ పటేల్, వాలీబాల్ క్రీడాకారులు, అభిమానులు, గ్రామస్తులు, యువకులు, తదితరులు, పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి

### కరాటే క్రీడ శారీరక దారుఢ్యానికి ప్రతీక..

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

కూకట్ పల్లి లోని శ్రీ పుల్లూరి నారాయణదాస్ కల్యాణ మండపం లో జరిగిన 5వ నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే కుంగ్ ఫు తాయిక్ వండ్ ఛాంపియన్ షిప్ 2024. ఈ కంపిటిషన్ కార్యక్రమంలో కర్ణాటక, మహారాష్ట్ర, బెంగళూరు, ముంబాయి, తెలంగాణ లోని నాగర్ కర్నూల్, వరంగల్, పెద్ద పల్లి జిల్లాల నుండి 450 మంది విద్యార్థులు కంపిటిషన్ లో పాల్గొన్నారు. నీయుద్ధ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు టి.సంతోష్ కుమార్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మేడల్స్, బహుమతులు సత్యం శ్రీరంగం గారి చేతులమీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో షీ టీం లక్ష్మి రుద్రమ దేవి సెల్ఫ్‌డిఫెన్స్ అకాడమీ ఫౌండర్, బి బ్లాక్ అధ్యక్షులు




తూము వేణు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, రవి, శ్రీధర్, సత్య శంకర్ తదితర మాస్టర్లు, అకాడమీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## హైదర్ నగర్ గ్యార్వీ షరీఫ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



హైదర్ నగర్ గ్రామ పరిధిలోని దర్గా వద్ద ముస్లిం మైనార్టీ ప్రజలు పెద్దయెత్తున నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ వేడుకల్లో కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పర్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని అన్నీ మతాలు కులాలు ఒక్కటే అనే విషయాన్ని గుర్తించి మత సామరస్యంతో అందరూ ముందుకు వెళ్లాలని అన్నారు. అన్నీ మతాల సారం ఒక్కటేనని, ఒకరికి ఒకరూ ప్రేమా ఆప్యాయతలతో సహాయపడుతూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. హైదర్ నగర్ ప్రాంతం తనకు రాజకీయంగా పుట్టినిల్లు వంటిదన్నారు. ప్రజా ప్రతినిధిగా మొదటి ప్రస్థానం హైదర్ నగర్ లో మొదలయ్యిందని అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందటం జరిగిందన్నారు. తనను కౌన్సిలర్ గా గెలిపించిన హైదర్ నగర్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేసినట్లు తెలిపారు. శ్మశాన వాటికలకు, పాఠశాలలకు, ప్రార్ధన స్థలాల కోసం భూములను ఆరోజుల్లోనే ఇప్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మొహమ్మద్ గౌసుద్దీన్, గొట్టిముక్కల బాస్కర్ రావు, స్థానిక నాయకులు కలీమ్, నక్క శ్రీనివాస్, న్యాయవాది శ్రీకాంత్, నర్సింగరావు, వెంకటేష్, సలీమ్, మహిళ నాయకురాలు జుబేదా బేగం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్‌లో జరిగే సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహాసభలను జయప్రదం చెయ్యండి

### ప్రభుత్వం 6 గ్యారెంటీ లను వెంటనే అమలు చేయాలి

### ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు పంపిణీ చేయాలి

### జిల్లా కార్యదర్శి పి.సత్తం, ఐలాపురం రాజశేఖర్

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి




బాలానగర్ లో పార్టీ ఆఫీసు లో శాఖ కార్యదర్శి ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఎం పార్టీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చెయ్యాలని సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.సత్యం పాల్గొని ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలను జయప్రదం చెయ్యడం లో కూకట్పల్లి నియోజవర్గం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ల ప్రజల సహకారం అందించాలని కోరారు. గత 3సం. లలో జరిగిన పోరాటాలు భవిష్యత్ లో జరిపే పోరాటాల తీర్మానాలను ఆమోదిస్తుంది. అని దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలకు అవలంభిస్తున్నాయి అని అన్నారు. ముఖ్యంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 5 నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రతి నియోజవర్గం లో 100పడకల ప్రభుత్వ హాస్పిటల్ లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాట్లు చెయ్యాలి.రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీ లను వెంటనే అమలు చెయ్యాలని,ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు,కొత్త పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణ రావు,జిల్లా కమిటి సభ్యులు వెంకట్ రామయ్య, ఐలాపురం రాజశేఖర్, కీలుకాని లక్ష్మణ్, ఎం. శంకర్, ఎం. నరేష్,జిల్లా నాయకులు లింగస్వామి, ఏ. విజయ,శివ ప్రసాద్, పి.శంకర్,చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నీ విజేతలకు నగదుతో పాటు షీల్డ్ ప్రధానం



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ నియోజకవర్గం పొతంగల్ మండలకేంద్రంలో పి.ఎస్.ఆర్, కే.బి.ఆర్ వాలీ బాల్ టోర్నమెంట్ గంధపు దత్తు, రాజు నిర్వహించిన గత రెండు రోజులుగా జరిగిన ఫైనల్ ప్రైజ్ మనీ, బహుమతులు అందజేసిన ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ అగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మెన్ కాసుల బాల్‌రాజ్. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మెన్ హన్మంతు మాజీ జెడ్పిటిసి పుప్పాల శంకర్ , మాజీ ఎంపీపీ పవన్ మాజీ జెడ్పిటిసి శంకర్ పటేల్ , యువజన మండల అధ్యక్షులు మన్సూర్, గ్రామా అధ్యక్షులు సాయిలు, ధన్రాజ్ తదితరులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బైక్ ఢీ.. ఒకరి మృతి..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ నియోజకవర్గం బీర్కూరు మండలం కొల్లూరు సబ్ స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి ప్రధాన రహదారిపై ట్రాక్టర్ ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. మృతుడు రైతు నగర్ గ్రామానికి చెందిన చాకలి రాములుగా గుర్తించారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సమగ్ర స్థాయిలో తెలియవలసి ఉంది. కేసును నమోదు చేసుకొని పోలీసు వారు దర్యాప్తు చేపడుతున్నాయి.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం, 04-11-2024
6

# ఉద్యోగుల సహకారంతోనే రాష్ట్ర అభివృద్ధి

**రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**సకల ఉద్యోగుల కార్తీక మాస వన సమారాధన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు**

టైమ్స్ ఆఫ్ వార్త ఖమ్మం





ఉద్యోగులు సహకరిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు అన్నారు. ఆదివారం గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి వారి మామిడి తోటలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ (టి.జి.ఈ.జే.ఏ.సి.) ఆధ్వర్యంలో నిర్వహించిన సకల ఉద్యోగుల కార్తీక మాస వన సమారాధన, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలుఆత్మీయ అతిథులుగా హాజరు కాగా, ఉద్యోగుల ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస రావు, చైర్మన్ మారం జగదీశ్వర్ లు ఆత్మీయ అతిథులకు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఉద్యోగులు కోరుకున్న మార్పు ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ముఖ్యమంత్రి ధైర్యం చేసి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. బ్యాలెట్ పేపర్ లలో ప్రభుత్వ ఉద్యోగులు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రజల అవసరాలు గమనించే ఉద్యోగులు ఇచ్చిన తీర్పుగా ఇది భావిస్తామని, ప్రజల కష్టాలను తీర్చగలిగేది ఉద్యోగులు మాత్రమేనని అన్నారు. ప్రజలు తమకు జరిగే మంచిలో అధికారుల, ఉద్యోగుల పేర్లు శాశ్వతంగా గుర్తు పెట్టుకుంటారని మంత్రి తెలిపారు. ఉద్యోగులకష్టాన్ని, త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. 40 సంవత్సరాలుగా తన హయాంలో పనిచేసిన అధికారుల కారణంగానే ప్రజలు తనను గుర్తు పెట్టుకున్నారని, రోడ్డు వేసిన, నీటిపారుదల పనులు జరిగిన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఉద్యోగుల శ్రమ ఉందని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారని, పూర్వ వైభవం తీసుకుని రావడంలో ఉద్యోగులు దృష్టి సారించాలని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రతి అంశాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యతని, బాకీలను దశల వారీగా చెల్లిస్తూ ఉద్యోగులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. హౌప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఉద్యోగులకు తెలుసని, పేద ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే ఉద్యోగులు నిజాయితీగా పని చేసే శక్తిని ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.

%కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో 204 ఉద్యోగ సంఘాలు ఏకధాటిగా పోరాటం చేశాయని, వీరి పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం రావాలని ఉద్యోగుల కోరడంతో నేడు ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఉద్యోగి, మహిళా, రైతు, జర్నలిస్టులు వారి అభిప్రాయాన్ని స్వేచ్ఛగా తెలిపే అవకాశం లేదని అన్నారు. హౌప్రజా ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతుందని, ఉద్యోగులకు భరోసా కల్పించడమే కాకుండా ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో దుబారాలు చేయకుండా జాగ్రత్తగా ఖర్చు చేస్తూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఉద్యోగస్తులకు సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు గత ప్రభుత్వం పెండింగ్ లో ఉంచిన డీఏ లను క్రమ పద్ధతిలో మంజూరు చేస్తామని అన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎం చర్చించారని, ఆర్థికేతర ఇబ్బందులను వచ్చే మార్చి లోపల పూర్తి చేస్తామని అన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఉద్యోగులు సంతృప్తి చెందే విధంగా,వారి ముఖంలో చిరునవ్వు వచ్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులేని సమస్యలను ఈ సంవత్సరం క్యాలెండర్ మారే లోపల పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. గత ప్రభుత్వాలు ఖమ్మం జిల్లాను అశ్రద్ధ చేసిందని, ప్రస్తుత ప్రభుత్వంలో ఖమ్మం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆనాటి ప్రభుత్వంలో ఉద్యోగులకు స్వేచ్ఛ, గౌరవం లేదని, అనేక ఇబ్బందులు పెట్టారని మంత్రి గుర్తు చేశారు. గతంలో టీచర్ల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా టీచర్లకు బదిలీలు, పదోన్నతులు కల్పించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ ఉద్యోగిని ఎటువంటి ఇబ్బందులకు పెట్టదని తెలిపారు. కొంతమంది ప్రశాంత వాతావరణం పాడు చేసే విధంగా అపోహలు సృష్టిస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేస్తూ ఉద్యోగులపై భారం తగ్గిస్తున్నామని అన్నారు. ఉద్యోగుల ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస రావు మాట్లాడుతూ గత 10 నెలల కాలంలో నిర్బంధ ప్రభుత్వం పోయి ప్రజాస్వామ్య ప్రభుత్వం వచ్చాక మన హక్కుల గురించి ప్రశ్నించే స్వేచ్ఛ మనకు లభించిందని, సీఎం మన సమస్యల పరిష్కారం కోసం మనతో సుదీర్ఘంగా చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. గత పది సంవత్సరాలలో ఉద్యోగుల జేఏసీ లేదని, సర్వీస్ రూల్స్ లేవని , ప్రశ్నిస్తే ప్రతిబంధకాలు, క్రిమినల్ కేసులు నమోదు చేశారని అన్నారు. రాబోయే మార్చి తర్వాత ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారని, దీపావళి తర్వాత ఆర్థికేతర సమస్యలు పరిష్కరించడంతో పాటు పెండింగ్ లో ఉన్న బకాయిలు చెల్లించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. రైతులు, మహిళలతో పాటుగా ఉద్యోగులు కూడా ప్రభుత్వానికి ప్రాధాన్యమేనని సీఎం తెలిపారని, ప్రతి ఒక్కరితో చర్చించి ఇచ్చిన మాటలు అమలు చేస్తామని అన్నారు. ఉద్యోగుల ఐకాస రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూతెలంగాణ రావడానికి ఖమ్మం జిల్లా చైతన్యం కారణమని అన్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించి సమస్యల పరిష్కారానికి సీఎం ముందుకు వచ్చారని అన్నారు. ఉద్యోసమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ కు కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణతో పాటు ఆర్కెస్ట్రా, చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశిష్టంగా అలరించాయి. జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న అన్నం శ్రీనివాస రావును, వనజీవి రామయ్యలను, సీనియర్ సిటిజన్ రిటైర్డ్ ఉద్యోగులను ఉద్యోగ సంఘాల తరపున ఉద్యోగుల ఐకాస రాష్ట్ర చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, శాసనమండలి సభ్యులు ఏ. నర్సిరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, టీజీఓ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్య నారాయణ, టి.జి.ఓ. జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేదాద్రి, టి.జి.హెచ్.డబ్ల్యు.ఓ. జిల్లా అధ్యక్షులు కోటిపాక రుక్మారావు, దేవరకొండ సైదులు, నాగిరెడ్డి, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు, పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్, తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట రాజీవ గృహకల్పలోని పార్కును అభివృద్ధి చేయండి

**సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్**

టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్‌పల్లి



జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలో ఉన్నటువంటి పార్కులను నేడు సిపిఐ బృందం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సభ్యులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ లు మాట్లాడుతూ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సిపిఐ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం భూపోరాటం చేసి గుడిసెలు వెయ్యిస్తుంటే సిపిఐ నాయకత్వాన్ని పిలిచి ప్రభుత్వమే ప్రజలకు ఇండ్లు కట్టించే బాధ్యత తీసుకుంటామని చెప్పి ఆయా ప్రాంతాలో వేలాది రాజీవ్ గృహ కల్పాలను కట్టించి ప్రజలకు ఇచ్చారని అదే సందర్భంలో ప్రజల కోసం పార్కులను కూడా ఏర్పాటు చేసారని, నేడు ఇక్కడ రెండు పార్కులు ఉన్నాయని వాటిని అభివృద్ధి చెయ్యాల్సిందిగా గత ప్రజావానిలో కూడా సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చామని అన్నారు. స్థానిక మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ఎంతవరకు పరిశీలించారో చూడాలని అన్నారు. ప్రజలు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసుకోవడానికి, చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పార్కులు నేడు వ్యర్థాలు వేసుకోవడానికి, వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి ఉపయోగపడుతున్నాయని, రాత్రి సమయంలో మందుబాబులకు,ఆసంఘిక కార్యకలాపాలకు నిలయమైనదని కావున డిప్యూటీ కమిషనర్ వెంటనే పరిశీలించి పార్కును అభివృద్ధి చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహయ కార్యదర్శి దుర్గయ్య కార్యవర్గ సభ్యులు సదానంద్, సహదేవరెడ్డి,ప్రజానాట్యమండలి బాబు, స్థానిక నాయకులు సాయిరెడ్డి, డేనియల్, ఇమామ్, వంశీ,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెం కార్యకర్తలతో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం

**తుంబురు దయాకర్ రెడ్డి వెల్లడి**


టైమ్స్ఆఫ్ వార్త–ఖమ్మం:



తిరుమలాయపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో నెల కొన్న పరిస్థితుల పై, ఆయా గ్రామాల వారీగా సమీక్షిం చేందుకు గ్రామాల్లోని ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలతో కూసుమంచిలోని ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, రెవిన్యూ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి పాలేరు నియోజకవర్గ ఎంఎల్ఏ, తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, సమీక్ష జరుపుతారని, ఆయా గ్రామాల్లోని ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలు అందరూ సకాలంలో హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## విద్యా నాగ సావిత్రి పుష్పాలంకరణ వేడుకల్లో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి



కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ మెయిన్ రోడ్ తబలా హొటల్ లో బిజెపి నాయకులైన ముద్దా వైవి సుబ్రహ్మణ్యం, అనూష దంపతుల కుమార్తె విద్యా నాగ సావిత్రి పుష్పాలంకరణ వేడుకల్లో కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ పాల్గొని చిరంజీవి విద్యా సావిత్రిని ఆశీర్వదించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు , ముఖ్య అతిధిగా బిజెపి నాయకులు మాధవరం కాంతారావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు వరద బాధితులకు స్లీపింగ్ కిట్స్ పంపిణీ

**మానవత్వం చాటుకున్న దేవకీ వాసుదేవరావు**

టైమ్స్ఆఫ్ వార్త–ఖమ్మం:



ఖమ్మం పట్టణ కేంద్రంలోని రామకృష్ణా విద్యాలయంలో మున్నేరు వరద బాధితులకు అభయ ఫౌండేషన్, విహేదేవకి ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో విహే వ్యవస్థాపకులు, బిజెపి (2019) ఎంపీ అభ్యర్థి దేవకి వాసుదేవరావు చేతుల మీదుగా స్లీపింగ్ కిట్లను (6ఐ6 ఫ్లోర్ మ్యాట్, రెండు దిండ్లు, కవర్లు, రెండు దుప్పట్లు) పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మందికి ఒక్కోదానికి వెయ్యి రూపాయలు విలువచేసే స్లీపింగ్ కిట్లను పంపిణీ చేశారు. గతంలోనూ మున్నేరు వరద బాధితులకు బియ్యం, నిత్యవసర, స్టీల్ సామాగ్రిని దేవకీ వాసుదేవరావు పంపిణీ చేశారు. ఇప్పటివరకు మున్నేరు వరద బాధితులకు సుమారు రూ.70 లక్షలు విలువ గల నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు దేవకీ వాసుదేవరావు అన్నారు. గతమెన్నడు లేని విధంగా ఖమ్మం నగరానికి వరదలు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం తప్పు ఎంతైనా ఉందని, ప్రకాష్ నగర్ వద్ద బ్రిడ్జి ముందు చెక్ డ్యాం ఏర్పాటు కారణంగానే వరదలు సంభవించాయనీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులకు రూ.16000 ఇచ్చి పులిహొర ప్యాకెట్లు పంచి చేతులు దులుపుకోవడం కాదు, రాజకీయాలకు అతీతంగా ఖమ్మం నగరంలోని ట్యాంక్ బండ్ లోకి నీరు వచ్చి తూము ద్వారా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే వర్షా కాలంలోగా ఖమ్మం నగర ప్రజలకు వరద ప్రభావం లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దాతల సహకారంతో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో మా వంతుగా వరద బాధితులకు సహాయం అందించడం జరిగిందన్నారు. మానవసేవే మాధవసేవ అనీ, పెద్దలు సాటివారు ఆపదలో ఉంటే ఆదుకోవాలని ఆలోచనతో సంస్థ ద్వారా దాతల సహాయంతో వరద బాధితులకు సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కష్టకాలంలో ఉన్న వారందరికీ మా సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉండి తోచిన సహాయం అందిస్తుంది. గ్రామీణ నిరుపేద యువతకు తోడుగా వారి బతుకులలో వెలుగులు నింపడం కోసం మా సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది. గ్రామీణ నిరుపేద యువత తమకు తాను సొంతంగా ఉపాధి కల్పించుకొని తమ కాళ్ళ మీద తాము నిలబడే విధంగా తయారుచేసి మానవతా విలువలను పెంపొందించి, సాటి మనిషికి సహాయపడే గుణాన్ని అందించి మంచి సమాజాన్ని నిర్మించడం అనేది ఈ సంస్థ ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు వనమా వేణుగోపాలరావు, విహే సెక్రటరీ చంద్రశేఖర్, జయంత్ పటేల్, కేశవ్లాల్ పటేల్, బిజెపి నాయకులు భద్రం, కొణతం లక్ష్మీనారాయణ, విఐహెచ్ఈ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లి సుధాకర్ వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలి

**యం. ఎస్. పి.జాతీయ నేత మంద కుమార్ మాదిగ**

టైమ్స్ ఆఫ్ వార్త – మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



మానుకోట జిల్లామరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో యం .ఎస్. పి. జాతీయ నేత మంద కుమార్ మాదిగ పాల్గొన్నారు అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొన్న జరిగిన మాల మహానాడు పాద యాత్ర లో రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధా కర్ వ్యాఖ్యలు ఎస్ సి వర్గీకరణ కు వ్యతిరేకంగా మాట్లాడం సరైన పద్ధతి కాదుని విరమర్శిం చారు. మంద కృష్ణ మాదిగ పై చేసిన వ్యాఖ్యలను వెనికి తీసుకొవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన విషయం లో ఎస్ సి వర్గీకరణ ముందుగా జరిపి అనంతరం మాదిగల, దక్కాల్సిన ఉద్యోగాలను మాకు ఇవ్వాలి. వర్గీకరణ చేయక ముందే ఉద్యోగాలు భర్తీ చేయడం సమంజసం కాదని తెలిపారు. ఈ కార్యక్రమం లో వేల్పుల సూరన్న యంఎస్ పి జాతీయ నేత, బొర్రా బిక్షపతి, యంఆర్ పి ఎస్ జాతీయ అధికార ప్రతినిధి, దూప్పెల్లి అనిల్ రాష్ట్ర కార్యదర్శి,యం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు శాంగంటి రమేష్ మాదిగ, యం ఎస్ పి జిల్లా అధ్యక్షులు పోలేపక ఎల్లయ్య, దూదపాక వెంకన్న, గుగ్గిల నవీన్, తుడం ప్రభాకర్, వెంకీటశ్వర్లు, ప్రవీణ్, నారాయణ, అరవింద్, చింత వెంకన్న మాదిగ పాల్గొన్నారు.

# తవ్వకాలలో బయటపడిన ముదిరాజుల పెద్దమ్మతల్లి విగ్రహం

- కాకతీయుల కాలంనాటి అరుదైన అమ్మవారి పురాతన శిల్పం లభ్యం
- వెండి బోనంతో అమ్మవారికి తొలి బోనం సమర్పించిన ముదిరాజ్ లు
- ప్రభుత్వం వెంటనే పెద్దమ్మతల్లి ఆలయం నిర్మించాలి
- నిత్యపూజలతోనే నగరానికి, ప్రజలకు తల్లి ఆశీస్సులు
- బీజేపీ 8వ డివిజన్ అధ్యక్షురాలు గోనెల అనురాధ

టైమ్స్ఆఫ్ వార్త–ఉమ్మడి వరంగల్:



బోనాలతో (వెండి తొలిబోనం) వస్తున్న భక్తులు



తవ్వకాలలో బయటపడిన శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహం



ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారు

హనుమకొండ పట్టణం ములుగు రోడ్ జంక్షన్ పెట్రోల్ పంపు వెనక భాగంలో కాకతీయుల కాలం నాటి పురాతన మహిమ గల పెద్దమ్మతల్లి అరుదైన శిల్పం నిర్మాణ తవ్వకాలలో బయట పడిందని బీజేపీ 8వ డివిజన్ అధ్యక్షురాలు గోనెల అనురాధ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.... ముదిరాజ్ ల ఇలవెల్పైన మహిమ గల శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహం హనుమకొండ పట్టణం ములుగు రోడ్ జంక్షన్ లోని పెట్రోల్ పంపు వెనక భాగంలో జరుగుతున్న నిర్మాణ తవ్వకాలలో అమ్మవారి విగ్రహం బయట పడిందన్నారు. ఆ తల్లిని సేవించుకోవడానికి ముదిరాజ్ కుల బంధువులందరూ, పట్టణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తల్లికి ప్రత్యేక పూజలలో భాగంగా ఆదివారం ఏనుగుల గడ్డ నుండి ములుగు రోడ్ వరకు అమ్మవారికి బోనాలను వందల సంఖ్యలో సమర్పించామన్నారు. వెండి బోణంతో ఆ తల్లికి మొదటి బోనం సమర్పించి, పూజలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, ఆలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆ తల్లికి నిత్యం పూజలు, అభిషేకాలు చేస్తూ నగర ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ముదిరాజ్ కుల బంధువులందరూ పాల్గొన్నారు. డప్పు చప్పులు, వాయిద్యాలు, నృత్యాలతో పాటలు పాడుతూ బోనాల పండుగ ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం,
04-11-2024
7

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కొమ్మాల ఎస్.ఎస్.సి 2011-12 బ్యాచ్**

టైమ్స్ఆఫ్ వార్త-వరంగల్:



వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం 2011-12 ఎస్.ఎస్.సి బ్యాచ్ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం సీనియర్ ఉపాధ్యాయులు దొమ్మాటి భిక్షపతి పీ.జీ.హెచ్ఎం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా గత 12 సంవత్సరాల విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఎస్ఎస్సి ఉత్తీర్ణతను సాధించిన విద్యార్థులంతా కలిసి చిన్ననాటి పూర్వజ్ఞాపకాలను, వారికి పాఠశాలతో, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశ నుంచి వారి వైవాహిక జీవితం, ఆలనా పాలనా, విద్యాభ్యాసాలు, వారి జీవితంలో నిలదొక్కుకున్న విధానం తదితర అంశాలు ఒకరినొకరు పంచుకొన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా విద్యార్థి విద్యార్థులు కలిసి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, అంకటి రాంమనోహర్, నారాయణ, అంకేశ్వరపు కుమారస్వామి, కె.అనితరాణి, విద్యార్థులు సతీష్, కోమల, స్వప్న, రవికుమార్, సతీష్, నవీన్, వంశీ, అఖిల్, దినేష్, నరేష్, క్రాంతి, శ్రీకాంత్, గణేష్, రాజేందర్, హత్తిరం, చాంద్ పాషా, పవన్, అభిలాష్, శ్రీధర్, సృజన్, సునీత, రజిత, శిరీష, రవళ, అనూష, వసంత, స్రవంతి, రజిత, మౌనిక, రాణి, అపరంజి, అనిత, మానస, మౌనిక, జ్యోతి, అనిత, సునీత, కావ్య, బరుపటి వంశీ, బి.సతీష్, మమత, స్వాతి తదితర విద్యార్థులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చ

## బాల్యమిత్రునికి స్నేహితుల ఆర్థిక సాయం...

టైమ్స్ఆఫ్ వార్త-రాయపర్తి:



అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి బాల్యమిత్రులు కలిసి ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన మామిడాల ప్రశాంత్ వృత్తిరీత్యా హైదరాబాద్ లో కండక్టర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్దినెలలుగా ప్రశాంత్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రికే పరిమితమైన దయనీయ పరిస్థితి. దీంతో ఓ వైపు వైద్య ఖర్చులు. మరో వైపు కుటుంబ పోషణకు అయ్యే ఖర్చులతో తీవ్ర ఇబ్బంది పడుతుండగా, సమాచారం అందుకున్న చిన్ననాటి మిత్రులు వెంటనే ప్రశాంత్ ను కలిసి పరామర్శించి, ఆర్థికసహాయం అందించారు. అనంతరం వారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్నేహితుడికి మేమున్నాము అంటూ భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో జెల్ల శ్రీధర్, మామిడాల యకాంబ్రం, పరుపాటి కిరణ్ కుమార్ రెడ్డి, యాకబ్ రెడ్డి, బెల్లి ఎల్లయ్య, చిలువేరు సునీల్ కుమార్, లేతకుల ప్రశాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సంధి అశోక్ రెడ్డి, బోయిని శ్రీనివాస్, దేవేందర్, సుధాకర్, వేముల రాజేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# ఉద్యమకారులను స్వరాష్ట్ర యోధులుగా గుర్తించాలి

**ఉద్యమకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా లింగయ్య జాఫర్ ఏకగ్రీవ ఎన్నిక**

**ప్రతి ఉద్యమకారుడికి పింఛన్, ఇంటి స్థలం ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి**

**ప్రభుత్వ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఉద్యమకారులకు ఇవ్వాలి**





టైమ్స్ఆఫ్ వార్త-చంద్రుగొండ

తెలంగాణ స్వరాష్ట్రం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించి. తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడంలో ముఖ్య భూమిక పోషించిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం (జేఏసీ) ఉమ్మడి చంద్రుగొండ, మండలం నూతన కమిటీని ఆ సంఘం బాధ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం చంద్రుగొండ మండల కేంద్రంలో ఉమ్మడి మండలాలైన చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, మండలాల మలిదశ ఉద్యమకారుల సంఘం (జేఏసీ) ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సమస్యలు ప్రభుత్వ దిష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని సంఘం బాధ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గాదె లింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి గా ఎస్కే జాఫర్, ఉపాధ్యక్షులుగా వేముల హరీష్, కోశాధికారిగా ఎస్కే అన్వర్, సహాయక కార్యదర్శిగా ఎండి జాకీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వరికూటి వెంకట్రావు, కార్యవర్గ సభ్యులుగా మోడెం నగేష్, టి బీముడు, శ్రీరాం రమేష్, బి శ్రావణ్, గుగులోతు రమేష్, ఎండి బాబు, పోట్రు వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా ఎస్కే ఉమర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల కనీస అవసరాలను కూడా గత ప్రభుత్వం దృష్టి సారించలేదు అన్నారు. ఇప్పుడు నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వ పథకాల్లో మొదటి ప్రాధాన్యత వారికే ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ హామీ మేరకు ఉద్యమకారులందరికీ స్వాతంత్ర సమరయోధులు లాగానే తెలంగాణ స్వరాష్ట్ర యోధులుగా గుర్తించి వారికి ప్రత్యేకంగా గుర్తింపు ఇవ్వాలన్నారు. ప్రతి ఉద్యమకారుడికి రూ 5000 రూపాయల పింఛను, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ కాలిని, ఉద్యమకారులకు రూ 10 లక్షల ఇన్సూరెన్స్ బీమా, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉద్యమకారుల పిల్లలకు విద్యా ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు, అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలు పరిష్కారం కోసం తామెప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు (జేఏసీ) నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామిశెట్టి సైదయ్య, సుంకర రామారావు, ఆకుల శ్రీనివాస్, దుంప అర్జున్, ఎండి నాబీద్, చల్లపల్లి రాజా, జల్లేళ్ళ రాము, ఎస్.కె అబ్బాస్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రామచంద్రనాయక్

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



దంతాలపల్లి మండలం పడమటి గూడెం గ్రామంలో ఉన్న బాలాజీ కాటన్ మిల్ లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ ప్రారంభించారు.అనంతరం రైతులు తెచ్చిన పత్తిలో తేమ శాతాన్ని పరిశీలించారు.డాక్టర్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ పత్తి వేసిన రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు,ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు పత్తిలో తేమ శాతం బట్టి ధరలు నిర్ణయిస్తారు,సీసీఐ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మార్కెట్ వైస్ చైర్మన్ దంతాలపల్లి మండల అధ్యక్షుడు బట్టు నాయక్, దంతాలపల్లి ఎంపీటీసీ యాకన్న, కొమ్మినేని రవీందర్, కొమ్మినేని సతీష్ ,గురుపాల్ రెడ్డి ,లింగారెడ్డి ,హరికృష్ణ, లింగమూర్తి, మాజీ ఎంపీటీసీ వీరన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలకు భారీగా తరలిరండి

**సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదుమూరి దయాకర్ రావు**

టైమ్స్ అఫ్ వార్త - చంద్రుగొండ



ఈనెల 20వ తేదీన గాంధీభవన్ లో జరిగే సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదుమూరి దయాకర్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన చంద్రుగొండలో మీడియాతో మాట్లాడుతూ.. సేవాదళ్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ గాంధీభవన్ లో ఈనెల 20వ తేదీన శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నేషనల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నేషనల్ సేవాదళ్ అధ్యక్షుడు లాల్ జి దేశురాయ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, పాల్గొననున్నారు. కావున ఉమ్మడి ఖమ్మం జిల్లా సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భారీ సంఖ్యలో పాల్గొని శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

# రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)..



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడు తూ.. క్రీస్తుపూర్వం 600 ఏళ్ల క్రింద నిర్మించిన భద్రకాళి అమ్మవారి ఆలయానికి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉందని, ఉమ్మడి కరీంనగర్,ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుండి భక్తులు వస్తారని, ఈ ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ పట్టణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి రెండవ రాజధానిగా అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వరంగల్ సమగ్రాభివృద్ధి చర్యల్లో భాగంగా భక్తుల అభిరుచికి అనుగుణంగా భద్రకాళి ఆలయం, మాడవీధులను ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆలయాన్ని అనుకుని ఉన్న చెరువును అభివృద్ధి చేయడానికి పరిశీలించామని అన్నారు. సుమారు 380 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు పూడిక పేరుకుపోయి, చెరువు లోతు తగ్గి, సమాంతరంగా మారడం కారణంగా నీరు నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని, వెంటనే చెరువు పూడికతీతకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన వెంటనే వరంగల్ ప్రాంతవాసులకు ఎయిర్‌పోర్టు సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్, ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటుతో పాటు రాబోయే 30 సంవత్సరాల వరకు నగర ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, అండర్ డ్రైనేజీ, ఎలక్ట్రిఫికేషన్ తదితర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలను తయారు చేశామని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళోజీ నారాయణరావు కళా క్షేత్రాన్ని, పట్టణానికి సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, కుడా పిఓ అజిత్ రెడ్డి, జిడబ్ల్యూఎంసి ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు భీంరావు, సంతోష్ బాబు, సీతారాం, ఇరిగేషన్, కూడా, జిడబ్ల్యూఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కమిషన్ ముందు మన వాదన వినిపిద్దాం

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్**

టైమ్స్ఆఫ్ వార్త-ఖమ్మం:



ఖమ్మంలోని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణమాచారితో కలిసి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 5వ తేదిన బీసీ కమిషన్ ముందు ఉంచవలసిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ... ఈనెల 5న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సమావేశాన్ని నిర్వహిస్తారని అన్నారు. కావున ఈ సమావేశాని జిల్లాలో ఉన్న బీసీ కులాల అన్నదమ్ములు, మేధావులు సద్వినియోగం చేసుకొని దశాబ్దాలుగా సామాజికంగా ఆర్థికంగా, విద్యాపరంగా, ఉపాధి రాజకీయ రంగాల్లో బీసీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై పెద్ద ఎత్తున మన వాదనలను వినిపించాలని పేర్కొన్నారు. కాబట్టి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున బీసీ రాజకీయ, ఉద్యోగ, మేధావి వర్గం తరలి రావాలని నారాయణవరపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగన్న, బోయిన పుల్లారావు, ఖమ్మం జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు సుగుణ, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెలి శ్రీనివాస్, ఖమ్మం నగర అధ్యక్షులు గద్దె వెంకట్రామయ్య, టౌన్ ప్రధాన కార్యదర్శి కేతన బోయిన నాగేశ్వరరావు, పామర్తి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ హరిహర సూతన్ నిత్య అన్నదాన వితరణ

**ప్రారంభించిన సాదూ రమేష్ రెడ్డి దంపతులు**

టైమ్స్ఆఫ్ వార్త-ఖమ్మం:



ఖమ్మం జిల్లా 31వ డివిజన్ పంపింగ్ వెల్ రోడ్ ప్రాంతంలో శ్రీ హరిహర సూతన్ నిత్య అన్నదాన ట్రస్టు చైర్మన్ వల్లెపు ఉపేందర్ (లక్కీ) స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాదూ రమేష్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రారంభించారు. శ్రీ హరిహర సూతన్ నిత్య అన్నదాన సేవ సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు 41 రోజుల పాటు ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అన్నదాన వితరణ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లెపు సైదులు, వల్లెపు పిచ్చయ్య, రమేష్, అఖిల్, శ్రీనాథ్, బన్నీ, సతీక్, యష్ తదితరులు పాల్గొన్నారు.